క్లుప్తంగా

చంద్రబాబువి మోసపూరిత హామీలు


గేదెల పురుషోత్తం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన నవరత్నాలు పథకాలను చంద్రబాబు నాశనం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంలో కోత విధించడం తగదన్నారు. గతంలో మెయింటెనెన్స్ ఫండ్ కింద రూ.1000 మినహాయిస్తే తప్పు పట్టిన ప్రస్తుత విద్యా శాఖ మంత్రి లోకేశ్.. ఇప్పుడు రూ.2000 కోత పెడుతూ ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

లావేరు తహసీల్దార్‌గా శ్రీనివాసరావు


తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు తహసీల్దార్‌గా జీఎల్ఈ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రాజశేఖర్ బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు ఇంతవరకు కలెక్టరేట్‌లోని జి–సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. శ్రీనివాసరావుకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 22 మంది ఎంపిక


శస్త్ర చికిత్సకు బయలుదేరి వెళ్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం బ్రాహ్మణవీధిలో కల్యాణి కంటి పరీక్ష కేంద్రంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకురాలు ఎస్.కల్యాణి గురువారం తెలిపారు. 22 మందికి కంటి శస్త్ర చికిత్సలకు అవసరమని గుర్తించామన్నారు. వీరికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు తరలించినట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవోగా నాగరాణి


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాణి

శ్రీకాకుళం అర్బన్: ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవోగా పి.నాగరాణి నియమితులయ్యారు. ఈమె గతంలో గార ప్రాజెక్టు సీడీపీవోగా విధులు నిర్వహించారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేసిన శోభారాణి గార ప్రాజెక్టు సీడీపీవోగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ జరిగేలా చూస్తామన్నారు.

గృహోపకరణాలు వితరణ


గృహోపకరణాలు అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రానికి నగరానికి చెందిన భోగి హరికృష్ణ దంపతులు ఫ్రిజ్, గ్యాస్ స్టవ్, కరెంట్ రైస్ కుక్కర్, మిక్సీలను గురువారం వితరణగా అందజేశారు. భోగి ప్రసాదరావు, హేమవతి దంపతుల జ్ఞాపకార్థం కేంద్రం ప్రతినిధి శేఖర్‌కు వీటిని కార్యక్రమంలో మిమిక్రీ శ్రీనివాస్, అంధవరపు మురికయ్య పాల్గొన్నారు.

పశువుల వ్యాన్ల పట్టివేత

ఎచ్చెర్ల: జలుమూరు మండలం నారాయణవలస సంత నుంచి విజయనగరంలోని అలమండకు గురువారం వ్యాన్‌తో పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని కుశాలపురం బైపాస్ సమీపంలో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ వ్యాన్‌ను పట్టుకున్నారు. ఏడు పశువులను కొత్తవలస గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఐదు పశువుల పట్టివేత..

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాల కూడలిలో అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు పశువులతో వ్యాన్‌ను జే.ఆర్.పురం పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారు జామున రాజమండ్రి నుంచి శ్రీకాకుళం వైపు వ్యానులో పశువులను తరలిస్తున్నట్లు జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీరుగారుతున్న లక్ష్యం


నిరుపయోగంగా బందరువానిపేట మరుగుదొడ్లు

- శిథిలమవుతున్న సామూహిక మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక నిరుపయోగం

గార: పల్లెల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు వాడుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాయి. అయితే వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదరాబాదరాగా అనేక చోట్ల నిర్మాణాలు చేపట్టారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన పంచాయతీరాజ్ సిబ్బంది దృష్టి సారించకపోవడంతో లక్షలాది రూపాయల నిధులు వృథాగా మారుతున్నాయి. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర అంటూ ప్రతి నెలా అవగాహన కల్పిస్తున్నా ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన వాటిని వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేయటం లేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని కూర్మనాథాలయం శ్వేతపుష్కరిణి దిగువన, కంచ్రవీధి చెంతన సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అయినా ఇంతవరకు వీటిని వినియోగించడం లేదు. బందరువానిపేట, కొర్ని, శాలిహుండం పంచాయతీ కొత్తపేట వద్ద సామూహిక మరుగుదొడ్లు నిర్మాణాలు చేపట్టారు. తీరప్రాంత గ్రామమైన బందరువానిపేటలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్థల సమస్య ఉంది. అందుకోసం మత్స్యకార సామాజిక భవనం ప్రాంగణంలో 30 సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అవి వాడుకునేందుకు అవసరమైన రన్నింగ్ వాటర్ సదుపాయం ఏర్పాటు చేయలేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ఇప్పటికే తలుపులు కూడా తుప్పుపట్టి పాడయ్యాయి. గది గోడలు కూడా పెచ్చులూడుతున్నాయి. విషసర్పాలు, కుక్కలు నిలయాలుగా మారాయి. కొర్ని పంచాయతీలో కొర్లాంకు వెళ్లే బీటీ రోడ్డు పక్కన లక్షలాది రుపాయలతో చెరువు గట్టుపై సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఆ పరిసరాల్లో తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. కొత్తపేట చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన గదుల్లో కొన్నింటిని స్థానిక అవసరాలకు వాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


శ్రీకూర్మం శ్వేతపుష్కరిణి సమీపంలో వాడుకలో లేని మరుగుదొడ్లు

రన్నింగ్ వాటర్ కల్పించాలి



సామాజిక మరుగుదొడ్లను ప్రజల కోసం నిర్మించడం బాగానే ఉన్నా రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించకపోవడంతో వినియోగానికి అవకాశం లేకుండాపోతోంది. నిర్మాణ సమయంలో గ్రామానికి దూరంగా నిర్మించడం కూడా సమస్యగా మారింది. గదుల్లో దుర్వాసన వస్తుండటంతో ఆరుబయటే వాడుకుంటున్నారు. దీంతో స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరడం లేదు.

– ఎల్.వి.ఎస్.ప్రసాదరావు, శ్రీకూర్మం

చర్యలు తీసుకుంటాం..

కమ్యూనిటీ మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకువచ్చేలా సంబంధిత కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. రన్నింగ్ వాటర్ లేకపోవడం వల్లే పాడయ్యే పరిస్థితి ఉంది. మరమ్మతులు చేయించడం వల్ల వినియోగంలోకి వస్తాయా లేదా అన్నది పరిశీలన చేసి నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– కూర్మారావు, ఈవోపీఆర్‌డీ, గార

రక్తదానం అభినందనీయం


రక్తదానం చేస్తున్న ఎఫ్‌సీఐ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) శ్రీకాకుళంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. 26 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ చొక్కాకుల సునీల్‌కుమార్, ఏజీఎం సందీప్ సర్కార్, మేనేజర్ జి.శ్రీహరిలు మాట్లాడుతూ రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, జి.రమణ, పి.చైతన్యకుమార్ రక్తదాతలకు పతకాలు, ధృవపత్రాలు అందించారు. వైద్య ఆరోగ్య శాఖ సూచనలతో ఈ నెల 14 వరకు అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని, రక్తదాన శిబిరాల ఏర్పాటుకు 9440490525 నంబరును సంప్రదించాలని కోరారు.

వేసవిలోనూ పుట్టగొడుగుల సాగు


పుట్టగొడుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న నైరా కళాశాల అసోసియేట్ డీన్ జోగినాయుడు

శ్రీకాకుళం రూరల్: వేసవిలో మత్స్యపు చిప్ప పుట్టగొడుగులను సాగుచేయడం సాధ్యం కాదంటూ చాలామంది రైతులు వెనకడుగు వేస్తారని, అలాకాకుండా పొగమంచు యంత్రం(ఫాగర్స్)తో ఉష్ణోగ్రత, తేమ సాంద్రాన్ని అదుపులో ఉంచుకొని సాగు చేయవచ్చని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.జోగినాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకం సాగును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరిగడ్డి పుట్టగొడుగులు, పాల పుట్టగొడుగుల పెంపకాన్ని చేయవచ్చన్నారు. కాగా, నైరాలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, మేనేజర్ డాక్టర్ వై.సృజన పర్యవేక్షణలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జి.లీలా ప్రసాద్, జి.మహేష్, పి.ప్రదీప్‌కుమార్, అనుపమ్ చౌదరి, కె.ధార్మిక, పి.ఝాన్సీ, ఎం.కావ్య, వై.కీర్తన, జి.రమాదేవి, ఆర్.సాయిశ్యామల, ఎ.సౌజన్య, టి.శ్వేత, వి.యజ్ఞసిరి ముత్యపుచిప్ప పుట్టగొడుగు, వరిగడ్డి పుట్టగొడుగుల పెంపకం చేపట్టారు.

అంత్యక్రియలకు అవస్థలు


చదును చేసిన శ్మశాన వాటికకు వినియోగించి జిరాయితీ స్థలం

- రోజంతా మృతదేహాన్ని ఉంచేసిన వైనం
- అధికారుల జోక్యంతో చివరకు అంత్యక్రియలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పిన్నింటిపేట గ్రామానికి చెందిన చాలప పార్వతి (65) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. కానీ ఈమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడ్డారు. మృతదేహాన్ని దహనం చేసేందుకు ఊరిలో 75 ఏళ్లుగా వినియోగిస్తున్న శ్మశానానికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. కానీ స్థల యజమాని అడ్డుకోవడంతో రోజంతా వేచి ఉండాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

పొందూరు మండలంలోని బురిడి కంచరాం గ్రామానికి చెందిన పిన్నింటి రాజ్యలక్ష్మికి తన కన్నవారి గ్రామమైన లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామంలోని సర్వే నంబరు 248/8లో 93 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. ఈ భూమిలోని 10 సెంట్లు స్థలాన్ని ఇదే పంచాయతీకు చెందిన గ్రామాలైన పిన్నింటిపేట, వెంకటరావుపేట గ్రామస్తులు గత 75 ఏళ్లుగా శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నారు. అయితే రాజ్యలక్ష్మి 8 నెలల కిందట ఈ పదిసెంట్లు బాగుచేసుకుంటానని వేరే చోట శ్మశానం చూసుకోవాలని తెలియజేసి, ఈ మధ్యనే స్థలాన్ని బాగు చేసుకున్నారు. అయితే చాపర పార్వతమ్మ మృతదేహాన్ని అక్కడకు తీసుకెళ్లగా అంత్యక్రియలు నిర్వహించేందుకు రాజ్యలక్ష్మి అంగీకరించలేదు. దీంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, లావేరు ఎస్ఐ, గ్రామపెద్దలు ఇక్కడకు చేరుకుని ఈ ఒక్కసారికి అంత్యక్రియలు చేయడానికి అనుమతి ఇవ్వాలని రాజ్యలక్ష్మిని అడిగారు. గ్రామస్తులకు వేరే చోట పదిసెంట్లు ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు ఇస్తామని, ఈ సారికి అనుమతి కోరడంతో సాయంత్రం ఆ స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.


శ్మశాన వాటిక వద్ద గంటల తరబడి వేసి ఉంచిన పార్వతమ్మ మృతదేహం

సాక్షి కార్యాలయంపై దాడి తగదు

ఎచ్చెర్ల: సాక్షి కార్యాలయంపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం సరికాదని పలువురు నాయకులు అన్నారు. ఇటీవల ఎచ్చెర్ల సాక్షి కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం కార్యాలయానికి వచ్చి సిబ్బందితో మాట్లాడి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించి కార్యాలయ ఆస్తులు ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నామన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో శ్రీకాకుళం ఎంపీపీ అంబటి శ్రీనివాసరావు, శ్రీకాకుళం జెడ్పీటీసీ సభ్యుడు ఎచ్చెర్ల శ్రీధర్, శ్రీకాకుళం నగర పార్టీ అధ్యక్షుడు సాధు వెంకటరావు, శ్రీకాకుళం ఇంటెలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ పిల్లల రామకృష్ణారావు, సతివాడ సర్పంచ్ యాల్ల నారాయణమూర్తి, తూలుగు సర్పంచ్ కొయ్యాన నాగభూషణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బాన్న నరసింగరావు, వూటపల్లి కృష్ణారావు, బాణ్ణశ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సీసీ కాలువల పరిశీలన


కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: కనుగులవానిపేటలో ఇటీవల నిర్మించిన సీసీ కాలువలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈఈలు గురువారం పరిశీలించారు. 'గెలిపించిన పాపానికి బిల్లు ఇవ్వరా?' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారుల స్పందించారు. డ్రైన్‌లకు సంబంధించిన ఖర్చు ఇంతవరకూ ఎంబుక్‌లో నమోదు చేయని విషయం తెలిసిందే.

సంగీత గురువుకు సత్కారం


గురువు ఈశ్వరరావును సత్కరిస్తున్న శిష్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీవాణీ సంగీత కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవం విజయోత్సవ సభ గురువారం జరిగింది. ఇలిసిపురం వద్ద శ్రీవాణీ సంగీత కళాక్షేత్రం వ్యవస్థాపకులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో విజయోత్సవానికి కారకులైన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం గురువు ఈశ్వరరావును శిష్యులు సన్మానించారు. కార్యక్రమంలో పన్నాల రామకృష్ణ, చరణ్‌శంకర్‌శర్మ, విశ్వేశ్వరరావు, రవి, రమణారావు, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

శ్రీకాకుళం అర్బన్: చదువుకునే వయసులో బాలలు కార్మికులుగా మారటం బాధాకరమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలను ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. చిన్నారులకు మంచి భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాలల సంక్షేమానికి ఇప్పటికే క్లబ్ తరపున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పారిశుద్ధ్య సమస్యతో పాట్లు


రణస్థలం పంచాయతీని పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు పేరుకుపోతోంది. అధికారులు స్పందించకపోవడంతో కొన్నిచోట్ల గ్రామస్తులే కాలువలను శుభ్రం చేయిస్తున్నారు. - రణస్థలం

చినుకు పడితే చిత్తడే


లావేరు మండల కేంద్రం ఆవరణ ఎప్పుడు వర్షమొచ్చినా బురదమయంగా మారుతోంది. గోతుల్లో నీరు నిలిచిపోవడంతో అధ్వానంగా తయారవుతోంది. మట్టివేసి చదును చేసి నీరు నిల్వకాకుండా చూడాలని అర్జీదారులు కోరుతున్నారు. - ఎచ్చెర్ల

పగలే వెలుగులు

లావేరు మండలం మురపాకలో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది. ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. - ఎచ్చెర్ల



అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని కృష్ణాపార్క్ సెక్టార్‌లో దూదివారి సందు, తుమ్మవీధి, మంగువారితోట అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం అంగన్‌వాడీ పిలుస్తుంది రా.. కార్యక్రమం నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అర్బన్ ప్రాజెక్టు అధికారి పి.నాగరాణి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి అంబటి రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, యోగేశ్వరి, ఎంఎస్‌కేలు హిమబిందు, మనీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, విజయలక్ష్మి, అరుణ, నీలవేణి, ఇందిర, ముత్యాలమ్మ, సరస్వతి, పార్వతి, శ్రీవిద్య, క్రిష్ణవేణి, ప్రమీల పాల్గొన్నారు.

బేస్‌బాల్‌లో గౌరీశంకర్‌కు రజతం


గౌరీశంకర్‌ను అభినందిస్తున్న బేస్‌బాల్ సంఘ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్ఠాత్మక ఆలిండియా ఫెడరేషన్ కప్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో శ్రీకాకుళం కుర్రాడు ఐ.గౌరీశంకర్ సత్తాచాటాడు. మహారాష్ట్రలోని అమరావతి వేదికగా ఈ నెల 6 నుంచి 10 వరకు జరిగిన ఈ మెగా టోర్నీలో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు ద్వితీయ స్థానంలో నిలవడంతో రన్నరప్ ట్రోఫీ సాధించింది. ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు యువ బేస్‌బాల్ క్రీడాకారుడు గౌరీశంకర్ రజత పతకం సాధించాడు. టోర్నీ ముగించుకుని జిల్లాకు వచ్చిన గౌరీశంకర్‌ను బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రవికుమార్, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు హర్షం వ్యక్తంచేశారు.

సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లు అందజేస్తున్న అరబిందో యాజమాన్య ప్రతినిధులు

రణస్థలం: విద్యార్థులకు ఫార్మా రంగంలో వివిధ ఉద్యోగవకాశాలు పొందేలా శిక్షణ ఇస్తున్నామని అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఎస్.దయానంద తెలిపారు. మండలంలోని వరిసాం పంచాయతీలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రసాయనిక పరిశ్రమల్లో క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్‌పై ఎమ్మెస్సీ చదివిన 28 మంది విద్యార్థులకు ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చామన్నారు. ఇంతవరకు 12వ బ్యాచ్‌లు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ తీసుకున్నాయన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దయానంద మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందిస్తున్నామని తెలియజేశారు. ఏపీటోరియా సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌చార్జి మనోహర్ రెడ్డి, ఏపీటోరియా, అరబిందో ఫార్మా బృంద సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విమాన ప్రమాదం బాధాకరం

శ్రీకాకుళం అర్బన్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం బాధాకరమని శ్రీకాకుళం ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని సీడీపీఓ జోల పాపినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.సిగడాం మండలం కప్పరాం పంచాయతీలో ఆయా (ఎస్టీ), మధుపాం సహాయకురాలు (బీసీ–ఎ), ఎచ్చెర్ల మండలంలో ఎస్ఎస్ఆర్ పురం సహాయకురాలు (ఎస్సీ), వెంకటేశ్వరపురం సహాయకురాలు (ఎస్సీ), తంగివానిపేట అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ–బి) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు ఎచ్చెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం: ఈ నెల 13వ తేదీన మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జే.ఆర్.పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వెల్పురాయి, దేవరాపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కూర్మ గ్రామంపై దాడి బాధాకరం

ఎచ్చెర్ల: హిరమండలం మండలంలోని కూర్మ గ్రామంపై దాడి జరగడం చాలా బాధాకరమని వెనుకబడిన తరగతుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు చాట్ల రమణ అన్నారు. లావేరు మండలంలోని బుడుమూరులో గురువారం మాట్లాడారు. ఈ దాడులను ఎవరైనా కక్షపూరిత చర్యలతో చేపడితే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు.